www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 జనవరి 2024 5
పశ్చిమ గోదావరి

జగన్ తీరుకు ఎంఎల్ఎలే పరార్

మాజీ మంత్రి కెఎస్.జవహర్

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం జగన్ పరిపాలనతో దళిత, బిసి ఎంఎల్ఎలు సైతం పారిపోతున్నారని మాజీ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. ఈ నెల 7న ఆచంటలో 'రా.. కదలిరా..' సభ ఏర్పాట్లు పరిశీలించేందుకు వెళ్తూ గురువారం ఆయన పాలకొల్లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఒక్క పిలుపుతో సభ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. జగన్ పనైపోయిందని ప్రజలు భావించడంతో వైసిపి తరపున పోటీ చేయడానికి అభ్యర్థులు కరువయ్యారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14కు 4 నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన కూటమి గెలుపొంది కూటమే అధికారంలోకి వస్తుందన్నారు.

రబీ 'సాగు'తోంది..!

- ఇంకా పూర్తికాని నారుమడులు
- డెల్టా రైతాంగంలో తీవ్ర ఆందోళన
- ఫిబ్రవరిలోనూ కొనసాగనున్న నాట్లు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి
- నీటి ఎద్దడి సమస్యపై రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ సాగు అదును దాటుతోంది. మిచౌంగ్ తుపాను ప్రభావం రబీసాగుపై తీవ్రంగా పడింది. గతేడాది ఈ సమయానికి డెల్టాలో 50 శాతానికిపైగా నాట్లు పూర్తవ్వగా ఈసారి పలు మండలాల్లో ఇంకా నారుమడులూ పూర్తికాని పరిస్థితి ఉంది. సాగు ఆలస్యమవుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు నీటి ఎద్దడి సమస్యలు వెంటాడనున్నాయంటూ రైతులు గుబులు చెందుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా రబీలో 3.80 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. డిసెంబర్ మొదటివారంలో రబీ నారుమడులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తుపాను విరుచుకుపడింది. దీంతో ఖరీఫ్ పంటంతా నీట మునగడంతో రైతులు పంటను కాపాడుకునే పనిలో పడ్డారు. అప్పటికే వేసిన నారుమడులు సైతం నీట మునిగి పనికి రాకుండాపోయాయి. ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమవ్వడంతో రబీ నారుమడుల వేయడంలో తీవ్ర ఆలస్యం జరిగింది. పలు మండలాల్లో ఇప్పటికే 60 శాతం మాత్రమే నారుమడులు పూర్తయ్యాయి. కొల్లేరును ఆనుకుని ఉన్న మండలాల్లో ఇంకా నారుమడులు పూర్తి కాలేదు. ప్రతియేటా డిసెంబర్ 20వ తేదీ తర్వాత నాట్లు ప్రారంభమై సంక్రాంతి పండుగకు దాదాపు పూర్తయ్యేవి. ఈసారి అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. డెల్టాలో ఇప్పటికే నాట్లు ఆలస్యం పెరుగుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నారుమడి వేసిన 20 రోజులకే బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. లేత నారుతో నాట్లు నాటడం వల్ల ఇబ్బందులు వస్తాయేమోనని భయం మరోవైపు రైతులను వెంటాడుతోంది. నాట్లు పూర్తయ్యేసరికి ఫిబ్రవరి మొదటివారం అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులే అంచనాలు వేస్తున్నారు. నాట్లు ఆలస్యంతో నీటిఎద్దడి సమస్య వివిధంగా ఉంటుందోనని భయం రైతులను వణికిస్తోంది.

నీటి ఎద్దడిపై ఆందోళన

రబీలో ప్రతియేటా నీటిఎద్దడి సమస్యను రైతులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత వంతులవారీ విధానం అమలు చేస్తున్నారు. గతంలో పండుగకు నాట్లు పూర్తికావడం వల్ల తర్వాత వంతులు అమలు చేసినా ఇబ్బంది రాలేదు. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పండుగకు సగభాగం కూడా నాట్లు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నాట్లు నాటే సమయంలో దుక్కులకు పెద్దఎత్తున సాగునీరు అవసరం. వంతులు అమలు చేస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. ఈ ఏడాది రబీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల సాగుకు 91 టిఎంసిల సాగు నీరు అవసరం ఉండగా అందుబాటులో ఉన్నది 82 టిఎంసిల నీరు మాత్రమే. వంతులవారీ విధానం, కరకట్టలు, మోటారు ఇంజన్లతో ఎత్తిపోసే విధానాలతో రబీసాగు గట్టెక్కుతుందని ముందుగానే తేల్చారు. ఫిబ్రవరి తర్వాత సాగునీటి ఇబ్బందులు మొదలవుతాయి. నాట్లు ఆలస్యం కావడంతో ఏప్రిల్ నెలాఖరు వరకూ సాగునీరు అవసరం. ఆఖరులో సాగునీరు ఎద్దడి తలెత్తితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఖరీఫ్‌లో రైతులు తీవ్రనష్టాలను చవిచూశారు. ముఖ్యంగా కౌలురైతులు సర్వం కోల్పోయారు. రబీలోనూ ఇబ్బందులు తలెత్తితే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. సాగునీటి సరఫరాపై రైతుల్లో తీవ్ర ఆందోళన కొనసాగుతోంది. రబీ సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


సభ ఏర్పాట్లపై టిడిపి నేతలతో చర్చిస్తున్న డిఎస్‌పి రవిమనోహరాచారి

ఆచంట నుంచే మార్పు ప్రారంభం

7న చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

టిడిపి గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి గోరంట్ల బుచ్చియ్యచౌదరి

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఆచంట నుంచే మార్పు ప్రారంభం కావాలని, రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని టిడిపి గోదావరి జిల్లాల సమన్వయకర్త గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం సాయంత్రం ఆచంటలో ఈ నెల ఏడో తేదీన చంద్రబాబు బహిరంగ సభ నిర్వహించే ప్రాంతాన్ని ఆయన పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. సభను జనసేన నేతలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకునే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి, జనసేన కూటమితో రాష్ట్రాన్ని వైసిపి గ్రహణం వీడాలని వ్యాఖ్యానించారు. నాలుగున్నరేళ్లలో ప్రతిపక్షాలను సైతం నిరంకుశ వైఖరితో అణిచేశారన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు సభను అందరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఉభయగోదావరి జిల్లాల జోన్ కోఆర్డినేటర్ మందలపు రవికుమార్, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నేతలు గొడవర్తి శ్రీరాములు, కేతా మీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసాపురం డిఎస్‌పి రవిమనోహరాచారితో కలిసి గోరంట్ల బుచ్చియ్యచౌదరి, తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు తదితరులు సభ నిర్వహించే ప్రాంతాన్ని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సభ సజావుగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పార్కింగ్ తదితర విషయాలపై టిడిపి నేతలతో చర్చించారు.

గణపవరంలో..

పాలకొల్లులో..

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు చర్యలు

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై అవగాహన, సమన్వయం, అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌డిఒలు, పోలీస్ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్ సంయుక్తంగా సమావేశమై జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలు, పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా నిర్వహించుకోవడానికి అన్ని ముందస్తు చర్యలను రెవెన్యూ, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. గత ఎన్నికల సందర్భంలో నమోదైన కేసులు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల నిర్వహణలో ఏర్పడిన అడ్డంకులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్లకు వెళ్లే మార్గాలు, మ్యాపింగ్ ఎంతో కీలకమన్నారు. ఎస్‌పి రవిప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో ఏఒక్క చిన్న సంఘటన జరగకుండా ఎన్నికలు నిర్వహించాలనే ధ్యేయంతో అధికారులు పని చేయాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలు, రౌడీషీట్లు, పీడీ యాక్ట్ అన్నీ పరిగణనలోకి తీసుకుని ముందస్తుగా నివేదిక సిద్ధం చేసుకోవాలన్నారు. మత, సామాజిక పరమైన గొడవలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలపై ఇప్పటి నుంచే గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్ల ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, కె.చెన్నయ్య, ఎం.అచ్యుతఅంబరీష్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎల్.రంగారెడ్డి, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డిఎస్‌పిలు బి.శ్రీనాథ్, సి.శరత్‌రాజ్‌కుమార్, కె.రవిమనోహరాచారి, సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్గవ్, ఎక్సైజ్ సిఐ కె.బలరామరాజు, ఎన్నికల తహశీల్దారు వై.దుర్గాకిషోర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన తప్పనిసరి: డిఆర్‌ఒ

ఎన్నికల నిర్వహణ, ఐటి అప్లికేషన్‌పై సంబంధిత అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి అన్నారు. నామినేషన్ ఘట్టం, లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు యాప్‌లు కీలకమని, ఈ నేపథ్యంలో నిర్వహించబోయే శిక్షణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికలు, ఐటి అప్లికేషన్స్‌పై ఆర్‌ఒలు, ఇఆర్‌ఒలు, డిప్యూటీ తహశీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, నియోజకవర్గస్థాయి ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

మా ఉద్యోగాలు తీసేస్తే.. సిఎం పదవి పీకేస్తాం

అంగన్వాడీల ఘాటు హెచ్చరిక - 24వ రోజు కొనసాగిన సమ్మె - వివిధ రూపాల్లో నిరసనలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

'మా అంగన్వాడీ ఉద్యోగాలు తీసేస్తే.. జగన్‌ను సిఎం పదవి నుంచి పీకేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు బి.ఝాన్సీరాణి సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. గురువారం స్థానిక కోర్టు వద్ద అంగన్వాడీల సమ్మె 24వ రోజు కొనసాగింది. అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంగన్వాడీలు జగన్ లాంటి ముఖ్యమంత్రులను చాలామందిని చూశారన్నారు. అంగన్వాడీలు ఈ రోజు వరకూ ప్రతి పైసా పోరాడి సాధించుకున్నదేనని అన్నారు. ఎవరి దయాదాక్షిణ్యాలు అక్కర్లేదన్నారు. అంగన్వాడీల పని, సేవలకు అనుగుణంగా వేతనాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఒకపక్క ధరలు పెరుగుతుంటే వేతనాలు పెంచారా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వసంతకుమారి, నళినిరాణి, కనకదుర్గ, మణిమాలతి, ధనలక్ష్మి, ప్రమీల, మధుశీల, రాజకుమారి, గార రంగారావు, రాధ, వరహాలు, జయంతి, జ్యోతి, కనక మహాలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

ఆచంట: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను బెదిరింపులు, అరెస్టులతో ఆపలేరని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ స్పష్టం చేశారు. అంగన్వాడీల 24వ రోజు సమ్మెకు రాయ్ మద్దతు పలికి మాట్లాడారు. అంగన్వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనన్నారు. అంగన్వాడీలకు మద్దతుగా ఈ నెల 9 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలకు పోకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, నేతలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, పద్మ, బొబ్బ శ్రీదేవి, జి.కమల, సత్యవతి ఝాన్సీ వెంకాయమ్మ, నాగలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

పాలకొల్లు: పాలకొల్లులో అంగన్వాడీల సమ్మె గురువారం కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఒంటి కాళ్లపై నిల్చొని తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, అంగన్వాడీలు ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, జి.ఝాన్సీరాణి, బి.అభిరాణి, ఎం.భవాని పాల్గొన్నారు.

భీమవరంలో..

వీరవాసరం: వీరవాసరంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినదించారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు నాగరత్నం, నిర్మల పాల్గొన్నారు.

గణపవరం: అంగన్వాడీలు తమ సమ్మెలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నేతలు బి.రామకోటి, బండారు మహలక్ష్మి, ఎ.కళ్యాణి మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కెవి.మహాలక్ష్మి, సిహెచ్.సీతామహలక్ష్మి, ఎస్.జయలక్ష్మి, కె.ధనలక్ష్మి, బి.రామలక్ష్మి, పి.ఇందిర, మణి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ల: అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దారుణమని సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు గురువారం సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, అంగన్వాడీలు యడవల్లి చంద్రావతి, ఝాన్సీరాణి, దవులూరి మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకూ పోరాడతామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. గురువారం 24వ రోజు సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో పెద్దింట్లు, నాగలక్ష్మి, సీత, రేఖ, శాంభవి పాల్గొన్నారు.

పోడూరు: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు 24వ రోజు గురువారం ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, సిఐటియు నేతలు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

ఉండి: నిర్బంధాలు, బెదిరింపులతో ఉద్యమాలను ఆపలేరని అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చైతన్య, డి.సత్యవేణి అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె 24వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా చైతన్య, సత్యవేణి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు తమ సమ్మె ఆగదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జి.కుసుమ, ఝాన్సీ కుసుమ, వీరవల్లి వెంకటలక్ష్మి, ప్రేమలత, లలిత, రాజశ్రీ, పద్మ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): అంగన్వాడీల సమ్మె గురువారం కొనసాగింది. సమ్మెకు సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ నేతలు కానూరి తులసి, పరమేశ్వరి మాట్లాడగా సాయిమహాలక్ష్మి, మౌనిక, సరస్వతి నాయకత్వం వహించారు.

భీమవరం రూరల్: అంగన్వాడీలు 24వ రోజు సమ్మెలో భాగంగా గురువారం ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నేతలు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడారు.

పెనుగొండ: అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. గురువారం ఆయన స్థానిక అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, అంగన్వాడీ లీడర్లు కానూరి తులసి, పీడీ.పరమేశ్వరి, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరులో అంగన్వాడీలు క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ సందర్శించి మద్దతు తెలిపారు.

సివిల్స్‌లో మెరిసిన కోమలి జైన్

ఐఆర్ఎంఎస్‌కు ఎంపిక


కోమలిని అభినందిస్తున్న ఎంఎల్ఎ రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన కోమలి జైన్ సివిల్స్‌లో ఐఆర్ఎంఎస్‌కు ఎంపికైంది. జాతీయస్థాయిలో సివిల్స్‌కు 11 లక్షల మంది హాజరవ్వగా 933 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికైన 40 మందిలో కోమలిజైన్ ఒకరు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామానాయుడు కోమలి జైన్ ఇంటికి వెళ్లి శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత కోమలి జైన్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థానం అధిరోహించాలన్నారు. కోమలిజైన్ ఘనత పాలకొల్లుకే కాదు రాష్ట్రానికే గర్వకారణమన్నారు. కోమలి జైన్ మాట్లాడుతూ ఆడపిల్ల అంటే పులి లెక్క అని, ఆడపిల్లలను అందరు తల్లిదండ్రులు చదివించాలన్నారు. నేడు ఆడపిల్లలు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరన్నారు. పలువురు కోమలి జైన్‌ను అభినందించారు.

తణుకులో పనిముట్లతో మున్సిపల్ కార్మికుల ఆందోళన

పనిముట్లు చేతబట్టగలం.. ప్రభుత్వాన్ని దించగలం

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

- 6లో

మహిళా కాంట్రాక్టు ఉద్యోగులను దుర్భాషలాడటం తగదు

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

చెవిలో పూలు పెట్టుకుని నిరసన

ప్రజాశక్తి భీమవరం రూరల్

రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగులను దుర్భాషలాడటం సరికాదని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బావాజీ అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం 16వ రోజుకు చేరుకుంది. దీంతో ఉద్యోగులు చెవిలో పూలు పెట్టుకొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బావాజీ మాట్లాడుతూ తమ ఉద్యోగులు ఎన్నోఏళ్ల నుండి ఇదే శాఖలో పని చేస్తున్నారని, ప్రభుత్వాలు తమకు న్యాయం చేస్తాయని నమ్మకంతో పని చేస్తున్నామని తెలిపారు. పాదయాత్ర సమయంలో జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకొస్తే ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీనే అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం తమతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, జి.మోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా జివిఆర్ ద్వితీయ వర్ధంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ మాజీ ఛైర్మన్ గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) ద్వితీయ వర్ధంతిని స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత జివిఆర్ విగ్రహానికి ఆయన తనయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు తిరుమాని ఏడుకొండలు, తోట భోగయ్య, కోడే యుగంధర్, గూడూరి ఉమాబాల మాట్లాడుతూ జివిఆర్ భీమవరం మున్సిపల్ ఛైర్మన్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయనరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, నేతలు నందమూరి ఆంజనేయులు, నల్లం రాంబాబు, ముద్దల కరుణ్‌కుమార్, పాలవెల్లి మంగ, వేండ్ర విజయదుర్గ, కానుబోయిన వెంకటరమణ, మాదిరెడ్డి శ్రీనివాస్, అల్లూరి నాగవల్లి, కందికట్ల ఎడ్వర్డ్, చెల్లంకి గిరి, చెల్లబోయిన సూర్యప్రకాష్, గంటి ప్రభు పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలకు నాంది పలకాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కళాశాల స్థాయిలోనే సరికొత్త ఆలోచనలు చేసి నవ కల్పనకు బాటలు వేయాలని నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ ఉద్యంతి సందీప్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎం.ప్రసాద్ వరప్ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరులోని ఎస్‌ఆర్‌వి జూనియర్ కళాశాలకు చెందిన 130 మంది విద్యార్థులు గురువారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సందీప్ మాట్లాడుతూ కష్టపడి చదివిన వారికి తగిన గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందన్నారు. దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో మరింతగా పెంపొందించే బాధ్యత యువతరానిదేనని తెలిపారు. సైన్స్, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం వంటి స్టెమ్ కోర్సులపై దృష్టి సారించాలన్నారు. నూతన సాంకేతికతలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని పట్టు సాధిస్తే వారు ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు పి.శంకర్, ఎస్‌ఆర్‌వి కళాశాల అధ్యాపకులు మురళీకృష్ణ, శైలు, మానస, రామాంజనేయులు పాల్గొన్నారు.

7న టిడిపి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆచంటలో నిర్వహించనున్న రా కదలిరా ఎన్నికల శంఖారావ సభను టిడిపి కుటుంబ సభ్యులు జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. భీమవరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం పాత్రికేయుల సమావేశంలో సీతారామలక్ష్మి మాట్లాడారు. ఓడిపోతామని తెలిసి జగన్ అభ్యర్థులను, ఇన్‌ఛార్జిలను మార్చుతున్నారని తెలిపారు. మహాసభ ప్రత్యేక పరిశీలకులు అనపర్తి మాజీ ఎంఎల్ఎ నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడారు. టిడిపి శ్రేణులు మహాసభను విజయవంతం చేయాలన్నారు. భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటె పార్థసారథి మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేటి శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హరినాథ్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - గణపవరం

ప్రముఖ రైస్ మిల్లర్ పెరుమాళ్ల హరినాథ్ మృతి తీరనిలోటని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సరిపల్లి గ్రామానికి చెందిన సాయినాథ్ ఇండస్ట్రీస్ అధినేత పెరుమాళ్ల హరినాథ్ (85) ఇటీవల గుండెపోటుతో మరణించారు. గురువారం ధర్మరాజు హరినాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట శ్రీను, తోట పవన్, తాడేలి జోగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో ఎక్కడబడితే అక్కడ చెత్త వేస్తున్న వారిపై జరిమానాలు విధించాలని గ్రామస్తులు గ్రామ సభలో కోరారు. వీరవాసరం గ్రామ సభ గురువారం సర్పంచి చికిలే మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయసారథి దృష్టికి తీసుకొచ్చారు. మార్కెట్ రోడ్డు వెంబడి చేపల దుకాణాల వద్ద రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎంపిటిసి చైర్మన్ మతం కరీ, వార్డు సభ్యులు గుత్తుల కృష్ణారావు సభలో తెలిపారు. తూర్పు చెరువు చుట్టూ చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, కొత్త ఇళ్లకు పన్ను వేసి పంచాయతీ ఆదాయం పెంచుకోవాలని పలువురు సభలో కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ వీరవాసరం పంచాయతీలో సిబ్బంది కొరత వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిని సరిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి రుక్మిణీదేవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పోలవరం ప్రాజెక్టు పూర్తి

కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకట గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్‌తోనే పూర్తవుతుందని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. కాళ్లకూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మేలు జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అనేక చోట్ల బిజెపి ప్రభుత్వం రైతులపై దాడి చేయడం, మైనార్టీ వర్గాలపై దాడి చేయడం అన్యాయమన్నారు. వైఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్‌లో చేరడం శుభ పరిణామమన్నారు.

'జనసైనికులపై లేనిపోని ఆరోపణలు తగవు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటమి భయంతోనే ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ జన సైనికులపై లేనిపోని ఆరోపణలు చేసి, అక్రమ కేసులు బనాయిస్తున్నారని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చనమలచెట్టు చంద్రశేఖర్ విమర్శించారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడారు. ఎంఎల్ఎ గ్రంధి కొంతమంది భీమవరం నియోజవర్గానికి సంబంధం లేని యువకులకు వైసిపి కండువా కప్పి వారిని జనసేన సైనికులని ప్రకటించడం సరికాదన్నారు. భీమవరంలో తప్పకుండా తమ అధినేత పవన్ పోటీ చేస్తారన్నారు.

'దళిత ద్రోహి సిఎం జగన్'

ప్రజాశక్తి - పోడూరు

దళితుల సంక్షేమం, అభివృద్ధిని అడ్డుకున్న సిఎం జగన్ దళిత ద్రోహి అని టిడిపి, జనసేన ఎస్‌సి నాయకులు తెలిపారు. వేడంగిలో గురువారం ఆయా నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి పీతల శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలను, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేయడం వల్లే ఈ నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. దళితులపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో పాలన సాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, సిద్ధిరెడ్డి అప్పారావు, ఉన్నమట్ల ప్రేమ్ పాల్గొన్నారు.

మొగల్తూరు : రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని పార్టీ నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. గురువారం సాయంత్రం ముత్యాలపల్లిలో బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, మూలా స్వామి పాల్గొన్నారు.

'చంద్రబాబు బిసి ద్రోహి'

ప్రజాశక్తి - ఉండి

చంద్రబాబు బిసి ద్రోహి అని వైసిపి రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి బాలం సత్యనారాయణ విమర్శించారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిడిపి మళ్లీ బిసిలను మోసం చేయడానికి జయహో బిసి పేరుతో రాష్ట్రంలో 40 రోజులు కార్యక్రమాలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తోందని తదెలిపారు. టిడిపిని నమ్మే పరిస్థితిలో బిసిలు లేరని అన్నారు. బిసిలంతా జగన్మోహన్ రెడ్డి వెంటే ఉన్నారని తెలిపారు.

ఒకే ఈతలో రెండు దూడలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి పెదగొల్లగూడెంలో పట్టపు రామకృష్ణకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రామకృష్ణ తన ఇంటి వద్ద పెంచుకుంటున్న ఆవు రెండు దూడలకు జన్మనివ్వడంతో వాటిని చూసేందుకు పలువురు రైతులు వచ్చారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - ఉండి

వాండ్రం గ్రామ శివారులోని పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచి, ఉండి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పేకాటాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,140 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉండి పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ స్థానం రెండు నెలల నుండి ఖాళీగా ఉండడమే కాకుండా స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండడంతో దాన్ని ఆసరాగా తీసుకుని మండలంలో జూదరులు పేకాట, కోడిపందేలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టును భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పనిముట్లు చేతబట్టగలం.. ప్రభుత్వాన్ని దించగలం

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా కార్మికులను రెచ్చగొట్టే విధంగా పోటీ కార్మికులు తీసుకురావడాన్ని సిఐటియు, ఎఐసిటియు నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. మున్సిపల్ కార్మికుల జెఎసి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా చేపట్టిన సమ్మె 10వ కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. ప్రభుత్వం అధికారుల ద్వారా సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడుతోందన్నారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్ చేయాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరారు. సమ్మెలో జెఎసి నాయకులు జి.నాని, నేలపు రాజు, బంగారు వరలక్ష్మి, నేలపు విశ్వనాథం, నిమ్మకాయల ధనలక్ష్మి, బంగారు ఏసేబు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, శ్రీను, సమ్మెకు సంఘీభావం తెలిపారు.

తాడేపల్లిగూడెం : మున్సిపాల్టీలో పోటీ కార్మికులతో పనులు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులను కార్మికులు గురువారం నిలదీశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. అయితే సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం మున్సిపల్ అధికారులు పోటీ కూలీలను తీసుకొచ్చి పనులు నిర్వహించడంతో వారిని సమ్మె చేస్తున్న కార్మికులు కలిసి సమ్మెకు దారి తీసిన పరిస్థితులను వివరించి మద్దతివ్వాలని కోరారు. దీంతో కొందరు కూలీలు వెనక్కి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎ.శామ్యూల్ యూనియన్ నాయకులను చర్చలకు పిలిచారు. పట్టణంలో

భీమవరంలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

డెంగీ కేసులు ఉన్నాయని అందువల్ల పారిశుధ్య పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శిబిరం వద్ద ఎఐటియుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు తాడికొండ కనకమహాలక్ష్మి, యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షురాలు మండేల్లి జయసుధ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులతో పనులు చేయించడం సరికాదన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, యూనియన్ కార్యదర్శి చంద్రరావు, కోశాధికారి కాటమరాజు, సహాయ కార్యదర్శి అల్లం నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు కర్రి నాగేశ్వరరావు, తెనాలి రాజు, కె.సతీష్, దయామణి, భాను నాయకత్వం వహించారు.

తణుకు రూరల్ : పనిముట్లు చేతబట్టగలం, ప్రభుత్వాన్ని పతనం చేయగలమని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె పదో రోజు కొనసాగింది. ఈ మేరకు కార్మికులు పనిముట్లు చేత పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ చాలీచాలని జీతంతో బతుకుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడంలో ప్రభుత్వం ఎందుకు ఆలోచిస్తోందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలపు ఆదినారాయణ బాబు, గుర్రాల చిన్న, డి.వల్లీ, నీలాపు రవి, ముత్యాల శివప్రసాద్, పడాల దానం, పి.అయ్యప్ప, బంగారు పైడమ్మ పాల్గొన్నారు.

పాలకొల్లు : రెండు రోజులుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల సాధనకు దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జనసేన పట్టణ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నియోజవర్గ సమన్వయ కర్త శిద్దిరెడ్డి అప్పారావు మాట్లాడారు. నేతలు తులా రామలింగేశ్వరరావు, పట్టణ ఉపాధ్యక్షులు పినిశెట్టి శ్రీనివాస్, విన్నకోట గోపి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న బాబూరావు, నేతలు

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

సమ్మెలో ఉన్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లాకమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా .బలరాం మాట్లాడుతూ జిల్లాల్లో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, వి.ఓ.ఎ లు, ఆశా వర్కర్లు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ సాధనకోసం రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలు, కోర్కెలు పరిష్కరించాలన్నారు. విధుల్లోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జగనన్న ఇళ్లకాలనీల్లో మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేవన్నారు. మంచీనీరు, రోడ్లు, డ్రెయినేజీ, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్ళు, కమ్యునిటీ హాలు ఏర్పాటుచేయాలన్నారు. లబ్దిదారులకు ఇవ్వని ఇళ్లను తక్షనం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇళ్లనిర్మాణానికి ఇచ్చే రూ. లక్షా యనభ్కైవేలు సరిపోవడంలేదన్నారు. ప్రభుత్వమే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.ఎన్.వి గోపాలన్,కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు,పి.వి ప్రతాప్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, కన్వీనర్లు పాల్గొన్నారు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

సేవల్లో ఎస్ఆర్‌కెఆర్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కాళ్ల

ఇంజినీరింగ్ కళాశాలలు దత్తత గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఏయూలో మొదటి స్థానంలో నిలిచిందని ఏయూ కోఆర్డినేటర్ బి.పావని తెలిపారు. పెదఅమిరంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. యుబిఎ కోఆర్డినేటర్ డాక్టర్ కెఎం.గణేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ ప్రతి కళాశాలా దత్తత గ్రామాల్లో సేవలందిస్తే నరేంద్ర మోడీ ఆశయాలు ప్రతి పల్లెకూ తీసుకెళ్లిన ఘనత ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామీణ ప్రగతికి నిరంతరం కృషి చేయాలన్నారు. అప్పుడే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ గతేడాది దత్తత గ్రామాలైన కోపల్లె, పెదమిరం, జక్కరం, కాళ్ల, కాళ్లకూరు గ్రామాల్లో తమ యుబిఎ విభాగం కళాశాల యాజమాన్యం సహకారంతో చాలా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందువల్లే ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 1150 విభాగాలు ఉండగా తమ కళాశాల మొదటి స్థానంలో నిలిచిందని, అందుకు యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహమే కారణమని తెలిపారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. పెదఅమిరం సర్పంచి డొక్కు సోమేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామాన్ని యుబిఎ దత్తత తీసుకొని సాంకేతిక సహకారం, సూచనలు అందించడం తమ గ్రామ ప్రగతికి ఎంతగానో దోహద పడుతోందన్నారు. పెదఅమిరం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రసన్న భారతికి, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత భారత అభియాన్ కోఆర్డినేటర్, ఆర్అండ్ డిన్ పి.ఎ.రామకృష్ణమరాజు, ఉన్నత భారత అభియాన్ ఉత్తమ కోఆర్డినేటర్ అవార్డు గ్రహీత టి.రాంబాబు, పి.భువనేశ్వరి, పి.రఘురాం, సూరిబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు శానిటైజర్లు, మాస్కులు అందిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ కోఆర్డినేటర్ పావని

సాబ్జీ, సత్యనారాయణ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, యుటిఎఫ్ సీనియర్ నేత పెన్మెత్స సత్యనారాయణరాజు అకాల మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తీరని లోటని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.పాల్ అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో సాబ్జీ, సత్యనారాయణరాజు సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుజిసి పెన్షనర్స్ అధ్యక్షులు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ సాబ్జీ, సత్యనారాయణరాజు ఎప్పుడూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల శ్రేయస్సు కోసం పరితపించేవారన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ భీమవరం యూనిట్ కార్యదర్శి సీతారామరాజు మాట్లాడుతూ షేక్ సాబ్జీ ఉద్యోగ, ఉపాధ్యాయ, సమస్యలు పరిష్కరించడమే కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఎస్‌టిఒ రవివర్మ మాట్లాడుతూ సత్యనారాయణ రాజు ఆకస్మిక మరణం తీరనిలోటన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్ మాట్లాడారు. సభలో పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణరాజు, కోశాధికారి రవిప్రసాద్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు అలుగు ఇశ్రాయేల్ రాజు, భీమవరం యూనిట్ కోశాధికారి సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కరరావు, అప్పన సత్యనారాయణ, యుజిసి పెన్షనర్స్ కార్యదర్శి సుబ్బారావు, పాండు రంగరాజు, గాయకులు చైతన్యప్రసాద్, చాన్ భాషా, మంతెన వెంకటరాజు, కెసిఆర్ రామలింగరాజు పాల్గొన్నారు.


సాబ్జీ, సత్యనారాయణరాజు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

హామీల అమలు జగన్‌కే సాధ్యం : ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాజకీయాల్లో విశ్వసనీయత వైఎస్ఆర్ కుటుంబానికి మాత్రమే సాధ్యమైందని రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక త్యాగరాజ భవనంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రంధి మాటాడుతూ ఒక్క భీమవరంలోనే ఏడాదికి 40 కోట్ల రూపాయల నగదు పెన్షన్ రూపంలో ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా 418 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మేడిది జాన్సన్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, భీమవరం ఎంపిడిఒ వెంకటలక్ష్మి, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసమేనని ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వారికి పెన్షన్లు అందజేస్తూ రుణమాఫీ, అమ్మఒడి, చేయూత తదితర పథకాలను అన్నమాట ప్రకారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేయడం జరుగుతోందన్నారు. ప్రతి కుటుంబమూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, ఎంపిడిఒ ఉంద్రు బాబ్జి రాజు, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

పోడూరు : ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మూడు వేల రూపాయలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో పెంచిన పెన్షన్లను లబ్ధిదారులకు వైసిపి పట్టణ ఇన్‌ఛార్జి గుడాల గోపితో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, ఎంపిడిఒ డి.సుహాసిని, సర్పంచులు పాల్గొన్నారు.

ఆచంట : ముఖ్యమంత్రి జగన్ పెన్షన్ పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన కొత్తగా మంజూరైన 137 పింఛన్లను రంగనాథరాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ ఇచ్చేందుకు రూ.25 వేలు తీసుకుంటున్నట్లు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. కరోనా సమయంలో అందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, వైసిపి మండల అధ్యక్షులు, సర్పంచి జక్కంశెట్టి చంటి, దిరిశాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : జగన్ అన్నమాట ప్రకారం పింఛను పెంచారని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అధ్యక్షతన కొత్త పెన్షన్లను ఎంఎల్ఎ చేతుల మీదుగా పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.పద్మజ, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.3000లకు పెంచారని వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఆయన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, సాలా నర్సయ్య, మోర్తా గిరీష్, బాకూరి నిరంజన్ పాల్గొన్నారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపిపి

ఆచంట: మండల పరిషత్ ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని తరగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన గురువారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. మరో మూడు నెలల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. వైస్ ఎంపిపి ఎ.నాగరాజు మాట్లాడుతూ కందరవల్లి పంచాయతీ పరిధి కడలివారి పాలెంలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలన్నారు. జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు మాట్లాడారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో కొత్తగా 137 పెన్షన్ల మంజూరైనట్లు ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ రహదారుల పక్కనున్న చెట్లను ఎటువంటి సమాచారం లేకుండా తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విద్యార్థులు ఇబ్బందులు పడే కార్యక్రమంగా ఉందని, ఒక పక్క క్లాసులు జరుగుతుంటే, మరోపక్క డీజె సౌండ్ సిస్టంతో గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

పాలకోడేరు : సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాలం శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం గరగపర్రు, గొల్లలకోడేరు సచివాలయాల వద్ద సాంప్రదాయ క్రీడలు ముద్దు, జూద క్రీడలు వద్దు అంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేలు, గుండాట వంటి జూద క్రీడలు నిర్వహించకూడదని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, విఆర్ఒ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజ హితం కోసం పాటుపడాలి

భీమవరం రూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పాటుపడాలనే ఆశయంతో వివేకానంద స్వామి రామకృష్ణ మిషన్ స్థాపించారని తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యురాలు గంగవరం శ్రీదేవి తెలిపారు. గురువారం తుందుర్రు గ్రామంలో రామకృష్ణ పరమహంస ధ్యాన మందిర శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంగవరం శ్రీదేవి మాట్లాడారు. ధ్యాన మందిర నిర్మాణానికి చీడే సత్యనారాయణ రామామణి దంపతుల జ్ఞాపకార్థం కుమారులు చీడే నాగేశ్వరరావు, భాస్కరరావు నాలుగు సెంట్లు భూమి, రూ.ఐదు లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాండ్రేకుల నరసింహారావు, సర్పంచి ఆరేటి వీర వీరస్వామి నాయుడు (పెద్దబ్బు), తాడేరు బ్యాంక్ సొసైటీ మాజీ ఛైర్మన్ ఆరేటి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్య సుధమ సేవలు అభినందనీయం

భీమవరం : సావిత్రి బాయిపూలే అవార్డు గ్రహీత, సహాయ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక సేవ నాయకురాలు సత్య సుధమ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని స్వగృహంలో గురువారం ఆమె పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆమె సేవలను కొనియాడారు. దళిత, బహుజన ఉద్యమాలు, పోరాటాల్లో చురుగ్గా పాల్గొని జిల్లాలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా ఉన్నతాధికారులకు తెలిపి సమస్య పరిష్కారానికి చొరవ చూపే వారని కొనియాడారు. సోషల్ వెల్ఫేర్ డిడి కె.శోభారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కటికతల. రాజారావు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చవ్వాకుల భరత్, పొన్నమండ బాలకృష్ణ, కవి, రచయిత కోలాటి చిన్న పెద్దిరాజు పాల్గొన్నారు.

లూయీ బ్రెయిలీకి నివాళి

ప్రజాశక్తి - మొగల్తూరు

అంధులు తేలిగ్గా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీ చేసిన మహనీయుడు లూయి బ్రెయిలీ అని ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి నాగిడి రాంబాబు అన్నారు. ముత్యాలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య వర్షిణి వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం లూయీ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు, ఉపాధ్యాయులు బి.కోటేశ్వరి, గుడాల తాతారావు పాల్గొన్నారు.

గోనె సంచులకు ఇబ్బంది

ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్

ఆచంట (పెనుమంట్ర): సార్వాలో అనుకున్న దాని కంటే ఎక్కువ దిగుబడి రావడం వల్ల ధాన్యం కొనుగోలులో రైతులు గోనె సంచులకు ఇబ్బందులు పడ్డారని నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం మార్టేరు రెడ్డి కళ్యాణ మండపం వద్ద ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ మండలం పరిధిలో ఎఒ, రెవెన్యూ, సొసైటీ, రైస్ మిల్లర్, విఆర్ఎలకు ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా అంబరీష్ మాట్లాడుతూ తుపాను సమయంలో సారాకు ఆదిలో నష్టం వాటిల్లిందన్నారు. అయినప్పటికీ రైతులు ఎక్కువగా 30 నుండి 40 బస్తాలు దిగుబడి పొందడంతో గోనె సంచులు అందకపోవడంతో ధాన్యం కొనుగోలు సన్నగిల్లిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు దండు అశోక్ వర్మ, సుబ్రహ్మణ్యం, గురు మూర్తి, ఎఒలు పాల్గొన్నారు.

అలరించిన వీణ కచేరి

భీమవరం రూరల్: పట్టణంలోని త్యాగరాజ భవనంలో జరుగుతున్న త్యాగరాజ 105వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం శ్రోతుల కరతాళ ధ్వనుల మధ్య బెంగళూరు వీణ విద్వాంసురాలు జె.యోగానందంచే వీణ కచేరీ అద్భుతంగా సాగింది. పంచరత్న కీర్తన జగదానందకారక, నాటరంగంలో ప్రారంభమైన వీణ కచేరి, సరస్వతి నమోస్తుతే - సరస్వతి రూపతాళం తదితర పాటలను వీణ కచేరీ చేశారు. సహ వాయిద్యాలుగా రక్షిత రమేష్ (బెంగళూరు), మృదంగం లక్ష్మి రాజశేఖర్ (బెంగళూరు), కంజర భాగ్య లక్ష్మణకృష్ణ ఉన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-01-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2816.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 80088 12798